‘స్వార్థం’ మంచిది కాదు. అయితే, స్వార్థం రెండు రకాలుగా వుంటుందనీ, అందులో ‘నా’ స్వార్థం కాక ‘మన’ స్వార్థం కొంత మంచిదనీ అంటే తప్పవుతుందా?

# ఇది కేవలం సగటు ప్రేమే

గంగుల నరసింహారెడ్డి


“ట్రిక్.... టక్”

తలుపు చప్పుడయింది. ఆ గదిలో ఉన్నవారంతా తమ తమ పనులను ఆపి తలుపువైపు చూశారు.

“నాన్నే అయ్యుంటాడు” అంది కాంతి.

తలుపు తీయడానికి కాంతి, సువర్ణ, వివేక ముగ్గురూ వేగంగా కదిలారు. కాని తలుపు పక్కనే కుర్చీలో కూర్చొని ఉన్న రవి వెంటనే లేచి తలుపు తీశాడు.

కాంతి మాట నిజమే-వచ్చింది రమణారావే,



“అరగంట లేట్ చిన్నాన్నా” చిరునవ్వుతో అన్నాడు రవి.

“కరెక్టు టైంకే వద్దామని ఎంతో ట్రై చేశానురా. కాని బస్సు రాలేదు” నవ్వుతూ అన్నాడు హ్యాండ్‌బ్యాగు టేబిల్‌పై పెడుతూ.

ఆ గదిలో జావకి తప్ప అందరూ చదువుకుంటున్నారు. అతని మేనల్లుడు కృష్ణ పేపరు తిరగేస్తూ మంచంపై గోడ కానుకొని కూర్చున్నాడు.

వాసమూర్తి గోపాల్ నోట్సు రాసుకుంటున్నాడు.

అన్నకొడుకు రవి రికార్డ్సు వేసుకుంటున్నట్లున్నాడు.

సుపుత్రుడు వివేక లెక్కలతో కుస్తీ పడుతున్నాడు.

మేనకోడలు భారతి, కూతురు కాంతి, తమ్ముడి కూతురు సువర్ణ నేలపై కూర్చొని చదువుకుంటున్నారు.

“తిన్నారా?” లుంగీ కట్టుకుంటూ అడిగాడు.

“నీ కొరకే చూస్తున్నాం” అన్నాడు కృష్ణ.

“మన మీల్సు టైం ఎనిమిది గంటలకే కదా, మీరయినా తినేయాల్సింది.”

“నీవు వచ్చి ఇంకెవరు రాకున్నా కరెక్టు టైంకే తినేవారమే. కాని నీ కొరకని ఇంతసేపూ ఆగాము.”

“నోనో. మన ఇంట్లో అంతా సమానమే. ధర్మం నాలుగు పాదాలా నడవాలి.”

“కాని సాయంత్రం మన యింట్లో ధర్మం మూడు కాళ్ళతో కుంటినడక నడచింది నాన్నా” అంది కాంతి.

“నా రాజ్యంతో యిలా జరగకూడదు....

ఏమయింది...." అని అతనంటుండగానే

"మీ రాజ్యాలు, ధర్మాలు తినేప్పుడు మాట్లాడుదురుగాని పదండి" అంటూ లేచింది జానకి.

"వెళ్ళండ్రా ప్లేట్లు కడిగి నీళ్ళు పెట్టండి."

ఆడపిల్లలు ముగ్గురూ లేచి వెళ్ళారు.

అది మూడుగదుల పోర్షను. ఒకటి వంటగది, మధ్యగది బెడ్‌రూం, మూడోదే రోడ్డువైపుకు ఉండేది- అదే డ్రాయింగ్ రూం, పిల్లలకు స్టడీరూం, బెడ్ రూమూనూ.

మధ్యగదినే డైనింగ్‌రూంలా వాడుకుంటారు.

రమణారావు బాత్‌రూంకు వెళ్ళొచ్చేసరికి అందరూ నేలపై గుండ్రంగా కూర్చొని వున్నారు. తనూ తన స్థానంలో కూర్చున్నాడు.

"ఏం కూరోయ్ ?" ప్లేటులో అన్నం పెడ్తున్న భార్యవంక చూస్తూ అన్నాడు.

"పొద్దుటి కూరే."

"ఈ పూటకు కొంచెం పప్పు వేయకూడదా....?"

"పప్పు నిండుకుంది, కిలో ఆరురూపాయలు" కసిగా అంటున్న భార్యవంక చిత్రంగా చూసి—

"పరవాలేదులే. పచ్చళ్ళతో తినేద్దాం" అన్నాడతను.

ఉదయం చేసిన కూరకూడా కొంచెమే ఉంది. అందరికీ తలా చెంచేడు పెడుతున్నప్పుడు ఆమెకు దుఃఖం ముంచుకొచ్చింది. బలవంతాన నిగ్రహించుకుంది.

"ఈ రోజు సాయంత్రం పెద్ద యుద్ధం జరిగింది మామయ్యా" నవ్వుతూ అంది భారతి.

"చూడు నాన్నా" అంటూ చేయి చూపిస్తూ "ఇక్కడెంత గిచ్చారో" అన్నాడు వివేక.

"అంటే యుద్ధంలో నీవు క్షతగాత్రుడవయ్యావన్నమాట. హాస్పిటల్‌కైనా తీసికెళ్ళలేదేంరా కృష్ణా" నవ్వుతూ అన్నాడు.

"నీవలాగే అంటావ్. నా చేతికి అప్పుడు రూళ్ళకర్ర దొరక్కుంటే నన్ను చంపేసేవారు" అన్నాడు వాడు కోపంగా.

"ఏమిటీ హత్యాప్రయత్నమే-అదీ నా యింట్లో! ఎవర్రా ఇంత ఘోరానికి పూనుకుంది. అప్పుడు మీ అమ్మ ఎక్కడికెళ్ళింది?"

"కూరగాయలు తేవడానికని సల్లకుంటకు వెళ్ళింది.... కాని పెదనాన్నాగో పాల్ మామయ్య రాకుంటే వీడే మమ్మల్ని చంపేసేవాడు" అంది సువర్ణ.

**ORWELL SCHOOL** ENGLISH MEDIUM

**PRE- KG to X Std. & MATRIC ALL GROUPS**

Imparts Coaching on Scientific Methods i. e., AUDIO-VISUAL AIDS, Charts & Models etc.

Library, Hostel Facilities and Dr's Care a Speciality Pioneers in Coaching for SAINIK SCHOOL.

Admissions Commenced from 20–4–1981

Hostel Facility Available

**Main : Near Sri Rama Theatre, VISAKHAPATNAM.**

**Branches : MMTC Colony, VISAKHAPATNAM.**

దూదిలా మెత్తని ఇడ్లీలు, నోట్లో వేసుకుంటే కరిగిపోయే గారెలు చేయడం ఎలా?

# సోనోవిజన్,

ఏలూరు రోడ్డు, విజయవాడ–2.



రేపటి పద్ధతులు చూడండి! వంట ఇంటిపని సులభతరం చేసుకోండి.

**B. A., & B. Com., ఎంట్రన్స్ పరీక్షలకు**

**"లక్ష్మి గైడ్స్"**

చదవండి

**Andhara University Open University System**

| | | |
|---|---|---|
| 1. | English Guide According to Latest Model with Non-Detailed | Rs. 12-00 |
| 2. | Scarlet Pimpernel Guide | Rs. 3-00 |
| 3. | Telugu Guide | Rs. 12-00 |
| 4. | Telugu Non-Detailed Guide | Rs. 3-00 |
| 5. | Indian History Guide (Telugu Medium) | Rs. 7-00 |
| 6. | Politics Guide ( „ ) | Rs. 10-00 |
| 7. | Public Administration ( „ ) | Rs. 6-75 |
| 8. | Commerce 1 & 2 Combind ( „ ) | Rs. 13-50 |

ఇంగ్లీషు మీడియంలో గూడా లభించును

మీ ప్రాంతీయ బుక్‌షాపులో సంప్రదించండి లేక

వివరములకు మాకు వ్రాయండి

**M/s. GUPTA BROTHERS**

Main Road :: Visakhapatnam-530001.

GANESH




"తిన్న తరువాత చూపిస్తానుండు, నా జుట్టు ఎంత పీకేశాడని, వీడి ధాటికి ఆగలేక నేను వెళ్ళి బాత్రూమ్‌లో తలుపేసుకొని కూర్చుంటే, సువర్ణేమో పక్కింటికి పారిపోయింది.

"అవును బావా, నేను వచ్చేసరికి వీడు గోపాల్రావుగారి అమ్మాయిలో మోహన్ బాబులా "చంపుతా చంపుతా" అంటూ యింట్లో తిరుగుతున్నాడు."

"ఏమో అనుకున్నాంగాని మన వివేక ఆడపిల్లల్ని వోడించిన వీరుడయ్యాడన్న మాట."

"ఇంతకూ ఏమయింది?"

"ఏమయిందంటే—"

నిజానికి వివేకకు, ఇంట్లోని ఆడపిల్లలకూ యెప్పుడూ పడదు. వాడికి తల్లిదండ్రుల దగ్గర యెక్కువ గారాబం కాబట్టి యెప్పుడూ ఇంట్లోనే తిరుగుతూ ప్రతి విషయంలో ఆడపిల్లలతో పోటీ పెట్టుకుంటాడు.

సమయం దొరికినప్పుడు వానిని బాగా తన్నాలని వాళ్ళు కూడబలుక్కున్నారు. ఆ రోజు సాయంత్రం యింట్లో రేపటి సంక్రాంతి కోసమని జానకి రవ్వలడ్లు చేసిపెట్టి కూరగాయల కోసమని బయటకు వెళ్ళింది.

ఆడపిల్లలు కూర్చొని ఒకటి తీసుకొని తింటుంటే వివేక వచ్చి "చెపుతా, అమ్మకు చెపుతా" అన్నాడు, మంచి కారణం దొరికిందనే ఉబలాటంతో.

వాడికీ కొంత తుంచిపెట్టారు. అయినా వాడు సంతృప్తిపడక "అంతా మీరే తినేశారు. చెపుతా అమ్మకు" అన్నాడు కోపంగా.

"వెధవా, తినికూడా చెబుతానంటావా" అంటూ కాంతి వాడి తలపై ఒకటి వేసింది. "నన్ను కొడతావా" అని వాడు కాంతి చెయ్యి పట్టుకొని కొరికేశాడు. వాడు యెంతకూ విడవడంలేదు. కాంతి లబలబలాడుతోంది. కాంతిని రక్షించాలని సువర్ణ వాడిని గట్టిగా గిచ్చింది.

ఇలా కొంతసేపు చాలా భీకరంగా జరిగింది పోరాటం. వాళ్ళు కోపంగా "చంపుతాం వెధవా, నీవు భలే మిడిసిపడుతున్నావు," అనేసరికి వాళ్ళమధ్య ఉక్కిరిబిక్కిరి అవుతున్నవాడికి వాళ్లు తనను నిజంగా చంపుతారనే భయం కలిగింది. వెంటనే విదిలించుకొని వెళ్ళి రూళ్ళకర్ర తీసుకొని వచ్చేసరికి వాళ్లు పారిపోయారు.

ఇలా వాళ్ళంతా ఆ కొట్లాట గురించే మాట్లాడుతున్నా రోజూ గలగలా మాట్లాడే జానకి మౌనంగా ఉండటం చూసి:

"మన హోం మినిస్టరు ఎందుకో కోపంగా ఉందేవిట్రా" అన్నాడు రమణారావు.

"నా కెందుకు కోపం" అంది జానకి ముభావంగానే.

ఏదో జరిగుంటుందని గ్రహించి యిప్పుడు ఆ విషయం పొడిగించడం బావుండదని టాపిక్ మార్చాడు.

"ఏంరా ఎక్స్‌టర్నల్ మినిస్టరూ, ఈ రోజయినా అన్నీ బిల్స్ కట్టేశావా?"

"అన్నీ పూర్తయ్యాయి. ఫైల్ చేశాను కూడా" అన్నాడు గోపాల్.

కృష్ణేమో ఫైనాన్సు మినిస్టరు. ప్రతి నెలా రమణారావు అతనికి కొంత డబ్బు ఇస్తాడు. పిల్లలకు ఏం కావలసినా అతన్ని అడగాలి. నెలాఖరున లెక్క చూపిస్తాడు.

రవిది వాణిజ్య మంత్రిపదవి. అతను ఇంట్లోకి కావలసిన వస్తువులు కొనుక్కొస్తాడు.

భోజనాలు ముగించి ఇవతలి రూంలోకి వస్తుండగా- "మరి లడ్డూలు చేశారన్నారు, ఇవ్వటం లేదేంరా?" అన్నాడు రమణారావు పిల్లల మనస్తత్వం తెలుసతనికి- వాళ్ళెలాగూ అడగలేరు. అందుకే తనే అడిగేస్తాడు.

"ఇప్పుడెందుకవి, రేపు పండుగకదా, రేపటికోసం చేశాను" అంది జానకి.

"ఓ మహానుభావుడేమన్నాడో తెలుసా...."

"ఏమన్నాడు....ఏమన్నాడు?" ముక్త కంఠంతో అడిగారు.

"ఏమన్నాడంటే — కల్ ఖానేకా లడ్డూ ఆజ్ ఖావ్, ఆజ్ ఖానేకా లడ్డూ అభీ ఖావ్" అందరూ పెద్దగా నవ్వారు.

"అందుకే యిప్పుడందరం సగం సగం లడ్డయినా తినాలి...."

ఇక తప్పలేదు జానకికి. అందరికి తలా ఒకటి తెచ్చిచ్చింది.

"నాన్నా నీ అభిమాన నటుడి సినిమా వచ్చింది. రేపు హాలిడేనే కదా, నీవూ, అమ్మా వెళ్ళండి."

"ఆఫీసు పనుంది. వెళ్ళాలిరా...."

"నీ కెప్పుడూ ఆఫీసే. అందరూ నీలా పనిచేస్తే మనదేశం ఎప్పుడో బాగుపడేది."

"సినిమా చూడక మూడు నెల్లాయె" అంది జానకి.

"సినిమాకెళ్తే పది రూపాయల ఖర్చు, పైగా తలనొప్పి. ఇంట్లో మీ అందరితో హాయిగా వుండొచ్చు."

"అందరూ నీలా ఉంటే సినిమా వాళ్ళు దివాలాతీసి వుందురు. ఎంటర్‌టైన్‌మెంటు వుండాలి."

"సరేరా పురజనుల కోరికపై ఒప్పుకుంటున్నాను. రేపు ఫస్ట్ షోకి రిజర్వేషన్ చేయండి" ఇక చదువుకోండి - ఒరే రవీ చాలా రాత్రి వరకు మేలుకొని వుండకు— హెల్త్ పాడవుతుంది గుడ్‌నైట్" అని పడుకోవడానికి వెళ్ళాడు.

తలుపు మూసి వచ్చింది జానకి.

"జానకీ ...."

మాటాడకుండా అటువైపు తిరిగి పడుకుంది.

"ఏమయింది జానకీ ఎందుకలా బాధపడుతున్నట్లు కనిపిస్తున్నావు. రాత్రినుంచి చూస్తున్నాను. కారణమేంటి చెప్పు."

".... .... .... .... ...."

"నిన్న రాజారాం ఇంటికెళ్ళి వచ్చినప్పటినుంచి నీవిలా మారిపోయావు. రాజారాం భార్య ఏమయినా అందా?"

"ఏమనలేదు."

"మరి...."

"నా మనసే బాధపడిందండీ. ఎందుకంటే...." అంటూ చెబుతోంది జానకి. వింటుండడమే కాకుండా అంతకన్నా ఎక్కువగా ఆలోచిస్తున్నాడు రమణారావు.

* * *

రాజారాం, రమణారావు స్నేహితులు. అతను కుటుంబంతోసహా ఓ మారు రమణారావింటికి వచ్చి తమ యింటికి ఆహ్వానించి వెళ్ళాడు.

జానకి యెన్నోమార్లు కోరగా అంతకు ముందు రోజే జానకి, రమణారావు లు రాజారాం యింటికి వెళ్ళారు.

రాజారాంది నాలుగు గదుల పోర్షను. దాన్నె ఆడంబరంగా తీర్చిదిద్దాడు. గుమ్మాలకు ఖరీదైన కర్టెనులున్నాయి. ప్రతి రూంలో సీలింగు ఫ్యానులున్నాయి. ఎక్కడి సామాను అక్కడ నీటుగా సర్ది ఉంది.

జానకి తమ ఇంటికి, ఈ ఇంటిని పోల్చుకుంటుంది.


తమది అసలు ఇల్లేనా. మధ్యాహ్నం తప్పా ఎప్పుడూ రైల్వే ప్లాటుఫారంలా కిక్కిరిసి వుంటుంది. రెండుగదుల నిండా పుస్తకాలూ, బట్టలూ చిందరవందరగా పడి వుంటాయి.

ఈ ఇంట్లోని డ్రాయింగ్‌రూంలో సోఫా ఉంది. ముందున్న టీపాయ్‌పై పత్రికలున్నాయి. గోడలకు విలువైన పెయింటింగ్స్ ఉన్నాయి. షెల్ఫుల్లో ఇంగ్లీషు, తెలుగు నవలున్నాయి.

తమకు డ్రాయింగ్‌రూం ఉందా? ఆ ముందు గదిలోఉన్న కుక్కిమంచంపైనే ఎవరొచ్చినా కూర్చోవాలి. అందులో గాలికి ఊగి గోడలకు కొట్టుకునే క్యాలండర్ల చప్పుడేకదా వినిపించేది.

రాజారాం డైనింగురూంలో అందమైన






డెకొలాం టేబిల్. మరో ప్రక్క రిఫ్రిజి రేటరుంది. స్టీలుది నల్లా డబ్బా వుంది నీళ్ళ కోసం.

తమకు డైనింగ్‌రూం యెక్కడిది? వంటగది నేలపై నేకదా తామంతా కూర్చొని తినేది. నీళ్ళ కోసం యిత్తడిబిందేకదా వుంది. దాన్నే తెల్లగా తోముకొని తనెంతగా మురిసిపోతుందని!

ఈ యింట్లో బెడ్‌రూంలో డెకొలాం మంచాలు. ఫోమ్ పరుపులు, డ్రెస్సింగు టేబిలూ ఎంతబాగా వున్నాయి.

తమది బెడ్‌రూం అనొచ్చా. ఈ మంచాల్ని చూస్తుంటే ఇన్నాళ్ళూ తను ఆ మంచంపై ఎలా పడుకుందా అనే అనుమానం కలుగుతుంది.

వంటగదిలో గ్యాస్‌స్టవ్, ప్రెషర్ కుక్కర్, అన్నీ స్టీలు పాత్రలు-అబ్బా!

తమ వంట గదిలోనే ఓ మూలకు నగం వరకు గోడకట్టి బాత్‌రూం చేశారు. తను కిరోసిన్ స్టవ్‌పై వండుతుంటే బాత్‌రూం లోంచి నీళ్ళు యెగిరివచ్చి పడతాయి. ఇంత స్టీలు సామాను తను జన్మలో కొనగలదా? ప్రెషర్ కుక్కర్‌లో తను కలలోనే వంట చేస్తుందేమో?! ఛీ!

రోజూ మూడు సీసాలపాలు తీసుకుంటారట. పిల్లలు ముగ్గురికి రెండుపూటలా హార్లిక్సు యిస్తారట. అందుకే యిలా బొద్దుగా వున్నారు మరి.

తాము తీసుకొనే రెండుసీసాల పాలలో ఒక సీసా టీకి అయితే, మరో సీసా మజ్జిగవుతుంది. తన పిల్లలు ఎన్నడూ పాలు తాగి ఎరగరు.

రెండు పూటలా వేడి వేడి కూరలూ, నెయ్యీ, చారు, పెరుగు వీరి భోజనం.

తన ఇంట్లో చద్దికూరలూ, పచ్చళ్ళూ, నీళ్ళ మజ్జిగ!

పిల్లలతో కలిసి వీళ్ళు వారానికోమారు సినిమాకెళ్తారట.

తామిద్దరయినా కలిసివెళ్ళేది యేడాదికి నాలుగయిదుసార్లు.

రాజారాంకు స్కూటరుంది. దానిపై హాయిగా వెళ్ళివస్తాడు.

తన భర్త – దరిద్రపు సిటీబస్సులో వెళ్తాడు. బస్సు దొరక్కపోతే రిక్షాలో వస్తారాడు. డబ్బు ఖర్చవుతుందని కాళ్ళిడ్చుకుంటూ నడిచే వస్తాడు.

రాజారాంకు తన భర్తకన్నా జీతం తక్కువేనట!

వెయ్యికి తక్కువ జీతం తెచ్చుకుంటున్న ఈ కుటుంబం ఇంత ఆడంబరంగా బ్రతికితే—

వెయ్యికంటె ఎక్కువ జీతం తెచ్చుకుంటున్న తమ కుటుంబం ఇంత సామాన్యంగా - ఇంకా చెప్పాలంటే ఇంత నికృష్టంగా బ్రతకడానికి కారణం ఎవరు?

ఎవరో కాదు—

తమ కుటుంబంపై వచ్చిపడ్డ ఈ పిల్లలు.

ఆయనగారి అక్కకొడుకు, అక్కకూతురు, అన్నకొడుకు, తమ్ముని కూతురు, తన తమ్ముడూనూ—

ఇంతమంది పోషణభారం యెక్కువైనందుకే తాము తమ ఆనందాల్ని కోల్పోవలసివస్తోంది. వీళ్ళే తమ సంకట జీవితానికి కారకులు!

* * *

కొంతసేపు ఏం మాట్లాడలేదు రమణారావు. భర్త యేమనకపోయేసరికి "నా కలా అనిపించడంలో తప్పులేదు కదండి. నేను, నా పిల్లలు, నా సంసారం అనుకొని మురిసిపోయేది- కేవలం ఆడదాన్నేకదా నేనూను" అంది జానకి.

"నిజమే జానకీ, నీది తప్పనను. ఈ విధమైన ఆలోచన నీ కెప్పటికైనా కలిగి తీరుతుందని నాకు తెలుసు. ఇందులో నిన్ను అనవలసిందేమీ లేదు. కాని నేను చెప్పేది కూడా విను. నన్నర్థం చేసుకోవడానికి ప్రయత్నించు.

ఈ ప్రపంచంలో అందరు కూడా తమ చుట్టూ 'నా' అని గిరి గీసుకొని జీవిస్తున్నవారే. వారు తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రులనుకూడా విస్మరించి తమ పిల్లలే తమ ప్రపంచ మన్నట్లుగా జీవిస్తున్నారు. కాని వారు తమ పిల్లల్ని ప్రేమిస్తున్నారా అంటే అది ప్రేమ అనలేం. వారు కేవలం తమ తమ ధర్మాన్ని, కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారు. నీ సంతానాన్నిగాని, నీ తల్లిదండ్రులనుగాని ఇష్టపడటం ఎప్పటికీ ప్రేమకాదు. మన పిల్లలతో సమంగా ఇతరులనుకూడా చూసినప్పుడే మనకు

వధువు కావలెను

త్వరలో విజయవాడలో స్థిరపడబోవు కమ్మ యువకునకు (35) వధువు కావలెను. నెలకు 1500 రూ. ఆదాయము. పూర్తి వివరములతో బాక్సు నెం. 1118, C/o "ఆంధ్రజ్యోతి" సచిత్ర వారపత్రిక, విజయవాడ కు వ్రాయండి.

ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★ 100% పాలియస్టర్ చీరలు
★ ఫుల్‌వాయిల్, అఫ్ వాయిల్ చీరలు
★ షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★ డ్రస్ మెటీరియల్సు, 2x2 రూబియాలున్ను
★ స్కూలుయూని ఫారంలు_వగైరాలకు
విజయ షో రూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షోరూమ్
J.D. హాస్పటల్ రోడ్డు,
గవర్నరుపేట.........విజయవాడ-2.

ప్రేమ విలువ తెలుస్తుంది. ఇతరులను ప్రేమించి, వారి నుంచి తిరిగి ప్రేమించ బడటంలో వున్న ఆనందం, సంతృప్తి - మన పిల్లల్ని మాత్రమే ప్రేమించి, వారి నుంచి తిరిగి పొందడంలో లేదు.

"అంటే మనం 'నా' అనే చిన్న పరిధిని దాటి 'మా' అనే పెద్ద పరిధిలోకి వచ్చాం. మనం ఎవరో దారినపోయే దానయ్యను ప్రేమించడం లేదు. కేవలం మన బంధువుల పిల్లలను, మన రక్త సంబంధం వున్నవాళ్ళను ప్రేమిస్తున్నాం. ఇందులోఎంతో ఆనందాన్ని అనుభవిస్తున్నాం. నిజానికి మనం రాజారాం కుటుంబం కంటె కూడా ఆనందంగా వున్నాం తెలుసా!

"ఇక మన ఈ 'మా' అనే పరిధిని దాటితే జనించేది విశ్వప్రేమే. దానికి పరిధిలేదు. ఇందులోకి వచ్చిన వారికి తన-మన భేదం లేకుంటుంది. అటువంటివారు కొందరే- బుద్ధభగవానుడు, యేసుక్రీస్తు, మన గాంధీమహాత్ముడూనూ ...."

చెప్పడం ఆపి జానకి వంక చూశాడు రమణారావు. ఆమె ఏదో అయోమయంగా చూస్తుందతని వంక. ఆమెలో తనకు కావల్సిన మార్పేమీ గోచరించలేదతనికి. ఆమెకు తను చెప్పవలసిన పద్ధతిలో చెప్ప లేదని అర్థమయిందతనికి.

"జానకీ, రేపీ పిల్లలంతా పెద్దయ్యాకి మన వివేక నీకు ఒక వెయ్యి రూపాయలు తెచ్చిచ్చినా అంత ఆనందాన్ని పొంద వేమో కాని రవి ఒక చీర తెచ్చినా నీవెంతో సంతోషపడిపోతావు. మనం మన మనో నేత్రాల ద్వారా భవిష్యత్తులోకి చూద్దాం. అదుగో అటువైపు చూడు." అంటూ చూపించాడు రమణారావు.

అతను చూడమన్నవైపు చూసింది జానకి.

అక్కడ—

* * *

కృష్ణ, గోపాల్, రవి, సువర్ణ, భారతి, అందరూ పెరిగి పెద్దయిపోతున్నారు.

కృష్ణకు బ్యాంకులో ఆఫీసరు ఉద్యోగం దొరికింది. చాలామంది కృష్ణకు తమ కూతుర్ని యిస్తామని వచ్చిపోతున్నారు. "నాకేం తెలియదు. అంతా మా మామయ్యకు, అత్తయ్యకే తెల్సు" అంటున్నాడు కృష్ణ. కృష్ణ, కాంతిల పెళ్ళి జరిగిపోతుంది.

రవి ఐ.ఎ.ఎస్.లో సెలక్టు అయ్యాడు. అతను వచ్చి జానకి,రమణారావుల కాళ్ళకు మొక్కుతున్నాడు. నేనింతవరకు నా తల్లి దండ్రులకుగాని, దేవునికిగాని యిలా మొక్కలేదు. మీరు వారికంటే కూడా గొప్పవారు చిన్నాన్నా" అంటున్నాడు రవి.

భారతి, సువర్ణల పెళ్ళిళ్ళు వైభవంగా జరుగుతున్నాయి. దంపతులు ముందుగా జానకి, రమణారావులకే మొక్కుతున్నారు.

గోపాల్ సొంతంగా ఓ ఇండస్ట్రీ నడుపుతున్నాడు.

వివేక పై చదువు కోసం విదేశాలకు వెళ్ళాలనుకుంటున్నాడు. భారతి, సువర్ణల భర్తలు అందుకు కావలసిన డబ్బు ఇస్తున్నారు.

అప్పుడే రిటైర్ అయిపోయాడు రమణారావు. "మామయ్యా ఇన్నేండ్లూ ఇంత పెద్ద ఉద్యోగంచేసి స్వంతఇల్లంటూ లేకుండా రిటైర్ అయింది నీ వొక్కడివే" అంటున్నాడు కృష్ణ.

"నా కెందుకురా మీరు లేరూ."

"మీరు మాలో ఏ ఒక్కరి దగ్గరున్నా మిగతావారికి కోపం వస్తుంది. అందుకే మీ కోసం మేమంతా కలిసి బంజారా హిల్సులో ఓ యిల్లు కట్టిస్తున్నాం. అక్కడికి మేమంతా ప్రతి పండగకూ వస్తాం. ఎలావుంది అయిడియా" అన్నాడు రవి.

"ఎందుకురా అనవసరపు ఖర్చు."

"అనవసరపు ఖర్చేలా అవుతుంది మామయ్యా. నీకెంత ఖర్చు పెట్టినా తక్కువే - నీవే లేకుంటే మే మింత వార మయ్యే వారమా?"

అప్పుడే ఇల్లు తయారయిపోయింది. ఎంత బాగుందని ఇల్లు!

ఆ ఇంట్లో జానకి, రమణారావులే ఇద్దరూ!!

ఏ బాధాలేకుండా నిశ్చింతగా,హాయిగా!!

* * *

జానకి కళ్ళు పరవశంగా మెరుస్తున్నవి. ఆమె ఇంకా అదే తన్మయత్వంలో వుంది. రమణారావు ఆమె వంక చూసి సంతృప్తిగా నిట్టూర్చాడు.




తెలుగునాటక శతజయంతి సందర్భంగా 'కళాసాగర్' ఏర్పాటుచేసిన రెండవ నాటక సదస్సులో ప్రసంగిస్తున్న ప్రముఖ తమిళ రంగస్థల నటుడు శ్రీ మేజర్ సుందర రాజన్, ప్రక్కన కూర్చున్నవారు ప్రసిద్ధ తమిళ నాటక రచయిత, నటుడు, పత్రికా సంపాదకుడు శ్రీ 'చో' రామస్వామి, కళాసాగర్ అధ్యక్షుడు డాక్టర్ ముద్దు కృష్ణారెడ్డి, తెలుగు నాటక రచయిత శ్రీ డి. వి. నరసరాజు, నటుడు శ్రీ మిక్కిలినేని

